క్లుప్తంగా

సీఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత



సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులను అందిస్తున్న ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర

సాలూరు: నియోజకవర్గంలో సాలూరు మున్సిపాలిటీ, సాలూరు, పాచిపెంట, మెంటాడ మండలాలకు చెందిన 10 కుటుంబాలకు సుమారు రూ.25 లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఉపముఖ్యమంత్రి రాజన్నదొర శుక్రవారం అందజేశారు. ఏ కష్టమొచ్చినా ప్రభుత్వం అండగా ఉంటుందని ఈ సందర్భంగా ఆయన లబ్ధిదారులకు భరోసా కల్పించారు. ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి రాజన్నదొరలకు లబ్ధిదారులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

కేజీబీవీలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం



ప్రిన్సిపాల్ నాగదుర్గ

మక్కువ: మండలంలోని కాశీపట్నం కేజీబీవీలో 6వతరగతి, ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం బైపీసీలో ప్రవేశాలకు అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ జి.నాగదుర్గ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. తల్లిదండ్రులను కోల్పోయిన చిన్నారులు, బడిబయట పిల్లలు, చదువు మధ్యలో వదిలేసిన చిన్నారులు, ఎస్టీ, ఎస్సీ, బీసీ, దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న బాలికలు మాత్రమే అర్హులని ఆమె పేర్కొన్నారు. ఈనెల 12వతేదీ నుంచి, వచ్చేనెల 11లోగా ఆన్‌లైన్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.

ఎ.వెంకంపేటలో బోరుబావి ఏర్పాటు

మక్కువ: మండలంలోని ఎ.వెంకంపేట గ్రామంలో రామాలయం వద్ద బోరుబావి ఏర్పాటుకు శుక్రవారం శ్రీకారం చుట్టారు. వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు మావుడి రంగునాయుడు తన సొంత నిధులు సుమారు రూ.50వేలతో గ్రామంలో ప్రజల సౌకర్యార్థం బోరుబావిని ఏర్పాటుచేసేందుకు ముందుకు వచ్చారు. ఈ మేరకు శుక్రవారం సచివాలయ కన్వీనర్ దొడ్డి హైమావతి, వైఎస్సార్‌సీపీ నాయకులు దొడ్డి శ్రీధర్‌రావు, దొడ్డి తిరుపతి, దొడ్డి రామకృష్ణ, గేదల సింహాచలంలు భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు.

342మందికి వైద్యసేవలు




శిబిరంలో వైద్య సేవలు అందిస్తున్న వైద్యాధికారిణి కిరణ్మయి

బలిజిపేట: మండలంలోని నారాయణపురంలో శుక్రవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష-2 వైద్యశిబిరంలో 342మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. బలిజిపేట పీహెచ్‌సీ వైద్యాధికారిణి క్రాంతి కిరణ్మయి ఆధ్వర్యంలో శిబిరాన్ని ఏర్పాటు చేయగా 342మంది రోగులు హాజరు కావడంతో వారికి వైద్యసేవలు అందించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. రోగులకు వివిధ రకాల వైద్య పరీక్షలతో పాటు రక్త పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రమేష్‌నాయుడు, చిన్న పిల్లల వైద్య నిపుణుడు పవన్‌కుమార్, ఈఓపీఆర్డీ రవికుమార్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఎయిం ఫర్ సేవలో ప్రతిష్టకు సిద్ధంగా వినాయక విగ్రహం

సీతానగరం: మండలంలోని లచ్చయ్యపేటలో గల ఎయింఫర్ సేవా ఛాత్రాలయంలో వినాయక విగ్రహాన్ని ప్రతిష్టించడానికి సిద్ధం చేశామని ఛాత్రాలయ ఛాత్రాలయం నిర్వాహకుడు ఎన్.సురేష్ తెలియజేశారు. ఈ మేరకు శుక్రవారం ఆయన మాట్లాడుతూ విద్యాకుసుమాల తయారీకి నిలయమైన ఎయింఫర్ ఛాత్రాలయం ఆవరణలో దాతలు సమకూర్చిన వినాయక విగ్రహాన్ని నెలకొల్పడానికి పీఠం తయారుచేస్తున్నట్లు చెప్పారు. ఎటువంటి ఆధారం లేని పిల్లలను విద్యాధికులుగా తయారు చేయడానికి ఎయిం ఫర్ సేవ ఛాత్రాలయంలో జిల్లాలోని పలుగ్రామాలనుంచి వచ్చిన విద్యార్థులకు వసతి, విద్యను సదుపాయాలు కల్పించినట్లు తెలిపారు. స్థానికంగా నిర్మించిన విగ్రహాన్ని త్వరలో ప్రారంభించడానికి సిద్ధం చేస్తున్నామన్నారు.

పట్టుదలతో లక్ష్యాలు సాధించాలి



అభిలాష మెటీరియల్‌ను అందిస్తున్న ఎంపీపీ ప్రమీల

పాచిపెంట: అనుకున్న లక్ష్యాలను పట్టుదలతో సాధించాలని పాచిపెంట ఎంపీపీ బడ్నాన ప్రమీల అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆమె మండల పరిషత్ కార్యాలయంలో అభిలాష కింద కాంపిటేటివ్ పుస్తకాలను సచివాలయాల పంచాయతీ కార్యదర్శులకు అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు ఈ పుస్తకాలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమం ఆవశ్యకతను గ్రామాల్లో వివరించాలని కోరారు..

వైఎస్సార్‌సీపీకి బూత్ కమిటీలే కీలకం

• ఎమ్మెల్యే అలజంగి జోగారావు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జోగారావు

పార్వతీపురంటౌన్: వైఎస్సార్‌సీపీకి బూత్ కమిటీలే.. మూలస్తంభాలని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. వచ్చే 2024 సాధారణ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సారథ్యంలో రెండవ సారి ప్రభుత్వం ఏర్పాటు చేయడంలో ఎలాంటి అతిశయోక్తి లేదని ఎమ్మెల్యే అలజంగి జోగారావు స్పష్టం చేశారు. పురపాలక సంఘంలోని 27,28వ పోలింగ్ బూత్‌ల పరిధిలో గల 15 వార్డుల ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, బూత్ కమిటీ సభ్యులతో కలిసి బెలగాంలో గల సచివాలయం కన్వీనర్ కౌన్సిలర్ చీకటి అనురాధ నివాసం వద్ద శుక్రవారం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. వచ్చే ఎన్నికల్లో ఎలా ముందుకు వెళ్లాలి, వైఎస్సార్‌సీపీకి అత్యధిక పోలింగ్ ఎలా నమోదు చేయాలన్న అంశాలపై అందరికీ దిశానిర్దేశం చేశారు. బూత్ పరిధిలో గల ప్రతి ఒక్క ఓటర్‌ను నేరుగా కలుసుకుని మన జగనన్న ప్రభుత్వం వారికి చేసిన మేలును తెలియచేయడంతో పాటు మన భవిష్యత్ మరింత బాగుండాలన్నా, సంక్షేమం, అభివృద్ధి పథకాలు మున్ముందు కొనసాగాలన్నా అందరూ తప్పక వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి మద్దతుగా నిలిచి మన ప్రజాప్రభుత్వాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్న విషయం అందరికీ తెలియజేయాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు కొండపల్లి బాలకృష్ణ, పార్టీ ఫ్లోర్‌లీడర్ మంత్రి రవికుమార్, కౌన్సిలర్లు చీకటి అనూరాధ, సువ్వాడ లావణ్య, బొత్స ఆనంద్, సచివాలయం కన్వీనర్లు ఏగిరెడ్డి భాస్కరరావు, స్థానిక నాయకులు, కార్యకర్తలు, బూత్ కమిటీ సభ్యులు, గృహసారథులు తదితరులు పాల్గొన్నారు.

జగనన్నను మళ్లీ ఆశీర్వదించండి

పార్వతీపురం టౌన్: వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి మరోసారి ఆశీర్వదించాలని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంపల గురాజు కోరారు. ఈ మేరకు పార్వతీపురం మండలంలోని వెలగవలస పంచాయతీలో ఎమ్మెల్యే అలజంగి జోగారావు ఆదేశాల మేరకు శుక్రవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గడప గడపకు వెళ్లి జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వంలో ప్రతి ఇంటికి జరిగిన మేలును వివరిస్తూ మళ్లీ 2024లో ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించామని తెలిపారు. ఈ ప్రచారంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బొమ్మి రమేష్, వైస్ ఎంపీపీ బంకురు రవికుమార్, ఆత్మచైర్మన్ తిరుపతిరావు, జేసీఎస్ కన్వీనర్ బంకపల్లి వాసుదేవరావు, వైఎస్సార్‌సీపీ మండల నాయకుడు మజ్జి చంద్రశేఖర్, సర్పంచ్‌లు మడక విశ్వనాథం, మళ్లక వెంకయ్య, కోటేశ్వరరావు, కార్యకర్తలు, గ్రామప్రజలు తదితరులు పాల్గొన్నారు.



వెలగవలసలో ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

మాతాశిశు మరణాల రేటు తగ్గించాలి

• డీఆర్‌డీఏ ఇన్‌చార్జ్ పీడీ వై.సత్యంనాయుడు



సమావేశంలో మాట్లాడుతున్న సత్యంనాయుడు

బలిజిపేట: మాతా,శిశు మరణాల రేటు తగ్గింపు అంశంలో మహిళా సంఘాలు చురుకైన పాత్ర పోషించాలని డీఆర్‌డీఏ ఇన్‌చార్జ్ పీడీ సత్యంనాయుడు తెలిపారు. ఈ మేరకు బలిజిపేట మండల సమాఖ్య కార్యాలయంలో వీఓఏలతో శుక్రవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మాతా, శిశు మరణాల తగ్గింపునకు మహిళాసంఘాలు గర్భిణులను ముందుగా గుర్తించి వారి పేర్లు వైద్యశాఖ, ఐసీడీఎస్ వద్ద నమోదుచేయించాలని సూచించారు. వారిలో రక్తహీనత, ఐరన్, కాల్షియం లోపం ఉన్నవారుంటే గుర్తించి అవసరమైన మందులు వారికి అందేలా చూడాలని, వాటిని గర్భిణులు వినియోగించేలా మహిళలు శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. నెలలో మూడు సార్లు వారిని సంప్రదించి తగు సూచనలు అందించాలన్నారు. గర్భిణులకు ఎటువంటి సమస్యలు ఉన్నా గుర్తించి అధికారులకు తెలియపరచాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో జీవనోపాధుల డీపీఎం ప్రవీణ్, బ్యాంకు లింకేజీ డీపీఎం వెంకట్, ఏపీఎం ఉమామహేశ్వరరావు, మండల సమాఖ్య అధ్యక్షురాలు మేరీ, వీఏఓలు, సీసీలు పాల్గొన్నారు.

నారాయణ పురంలో సిర్లి పోతన్న జాతర



పోతన్న గుడివద్ద భక్తులు

బలిజిపేట: మండలంలోని నారాయణపురంలో సిర్లి పోతన్న జాతరను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. బత్తుల పుల్లయ్యను పూజారి వేషంలో గ్రామంలోని పురవీధుల్లో ఊరేగించి భక్తులు వారి మొక్కులను తీర్చుకున్నారు. ఊరేగింపులో యువకులు, భక్తులు పాల్గొని మేళతాళాలతో సందడి చేసిన ఊరేగింపు కనువిందు కలిగించింది. ఉదయం నుంచి పోతన్న గుడివద్దకు గ్రామంలోని భక్తులు వెళ్లి పసుపు, కుంకుమలతో పూజలు చేసి వారి మొక్కులను తీర్చుకున్నారు. సాయంత్రం సమయంలో పూజారి గ్రామ పురవీధుల్లో తిరిగేటప్పుడు భక్తులు కాళ్లు కడిగి, వస్త్రాలను పాదాలకు తాకించి, నీళ్లతో స్నానాలు చేయించారు. సాయంత్రం గుడి ప్రాంగణంలో జాతర నిర్వహించారు. సిర్లి జాతరకు ముందు మొక్కులు ఉన్నవారు గ్రామాలలో పోతన్న వేషంలో జోగి దండి మొక్కు తీర్చుకున్నారు. సంప్రదాయంగా వస్తున్న సిర్లి పోతన్న జాతరను గ్రామస్తులందరూ ఎంతో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో నారాయణపురంతో పాటు బలిజిపేట, వెంగాపురం, పలగర. వివిధ గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు.

విధిగా ఎన్నికల ప్రవర్తనా నియమావళి



మాట్లాడుతున్న ఎంపీడీఓ ఎం.ఈశ్వరరావు

సీతానగరం: త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నిలను పురస్కరించుకుని ఎన్నికల కమిషన్, జిల్లా ఎన్నికల అధికారి జారీ చేసిన ఆదేశాలను సీతానగరం మండలంలోని సచివాలయ ఉద్యోగులు, వీఆర్వోలు, ఇతర శాఖల అధికారులు విధిగా అమలు చేయాల్సిన ఉందని ఎంపీడీఓ ఎం.ఈశ్వరరావు అన్నారు. ఈ మేరకు ప్రతి శుక్రవారం మండలపరిషత్ కార్యాలయంలో తహసీల్దార్ జీవీ జనార్దన్ అధ్యక్షతన వీఆర్వోలు, బీఎల్వోలు, సచివాలయ ఉద్యోగులతో ఎన్నికల నిర్వహణపై సమావేశం నిర్వహిస్తారు. ఈ సందర్భంగా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ కోడ్ అమలు చేసినప్పటి నుంచి పోలింగ్ ముగిసేవరకూ ఎన్నికల నిబంధనలు వర్తిస్తాయని, ఎన్నికల కోడ్ నిబంధనలకు లోబడి వివిధ పార్టీల అభ్యర్థులు ఎన్నికల ప్రచారం చేయాల్సి ఉందన్నారు. తహసీల్దార్ జీవీ జనార్దన్ మాట్లాడుతూ మండలంలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లు తమ ఓటు వినియోగించుకునేందుకు వచ్చిన వికలాంగులు, వృద్ధుల రాకపోకల సౌకర్యార్థం(ర్యాంప్), తాగు నీరు సౌకర్యం. విద్యుద్దీకరణ పనులను పరిశీలించినట్లు చెప్పారు. గ్రామస్థాయి అధికారులంతా ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినప్పటి నుంచి ప్రచారం కోసం రాజకీయ పార్టీల నాయకులు వినియోగించే సాధనాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. అన్ని పోలింగ్ కేంద్రాల పర్యవేక్షణకు నియమించిన అధికారులకు అవసరమైన సమాచారం ఇచ్చి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ కె.కుమారవర్మ, ఇన్‌చార్జి ఆర్‌ఐ రామారావు, పంచాయతీ కార్యదర్శులు వెల్ఫేర్ సహాయకుడు, వీఆర్వోలు, డీఏలు పాల్గొన్నారు.

ఎన్నికల ఏర్పాట్లు పక్కాగా ఉండాలి

• ఐటీడీఏ పీఓ విష్ణుచరణ్

సాలూరు: ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పక్కాగా ఉండాలని ఈఆర్ఓ, ఐటీడీఏ పీఓ విష్ణుచరణ్ ఆదేశించారు. ఈ మేరకు సాలూరు పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఏఎస్పీ సునీల్‌శ్రవణ్‌తో కలిసి ఎన్నికల ఏర్పాట్లపై పోలీసులు, ఎన్నికల సిబ్బందితో శుక్రవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఎన్నికల సిబ్బంది ప్రతి ఒక్కరూ నిబద్ధతతో పనిచేయాలని కోరారు. ఎన్నికల నియమావళిని వివరిస్తూ ఎంసీసీ బృందాలు, ఖర్చుల పర్యవేక్షణ కమిటీ, పర్యవేక్షక బృందాలు ప్రతిక్షణం అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన 24 గంటల్లో ప్రభుత్వ కార్యాలయాలు, ప్రాంగణాల్లో ఫొటోలు, బ్యానర్లు, పోస్టర్లు తొలగించాలని ఆదేశించారు. మండల అభివృద్ధి అధికారులు ఎన్నికల ప్రవర్తనా నియమావళి నోడల్ అధికారులుగా వ్యవహరిస్తారని, ఎక్కడా ఉల్లంఘనలు జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. తనిఖీ బృందాలు పట్టుకున్న డబ్బు, ఇతర వస్తువులను జప్తు చేసి కేసు పెట్టడంతో పాటు వాటి వివరాలను ఈయాప్‌లో తప్పనిసరిగా నమోదు చేయాలని సూచించారు. నామినేషన్లు, ఎన్నికల నిర్వహణ సజావుగా జరిగేలా చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు.

‘మొల్ల’ను గుర్తించిన ప్రభుత్వానికి కృతజ్ఞతలు

• కుమ్మరి శాలివాహన సంఘం జిల్లా అధ్యక్షుడు శంకర్రావు



మక్కువ: 16వ శతాబ్దంలో రామాయణాన్ని తెలుగులో రచించిన కవయిత్రి మొల్లమాంబను రాష్ట్రప్రభుత్వం గుర్తించడం ఎంతో ఆనందంగా ఉందని కుమ్మరి శాలివాహన సంఘం పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షుడు కొత్తూరు శంకర్రావు సంతోషం వ్యక్తం చేశారు. ఈ మేరకు మండల కేంద్రం మక్కువలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కవయిత్రి మొల్లమాంబ జయంతిని ఏటా కలెక్టరేట్‌లలో జరుపుకోవాలని ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి గొప్ప నిర్ణయం తీసుకున్నారన్నారు. గతంలో ఏ ముఖ్యమంత్రీ కవయిత్రి మొల్లమాంబ గొప్పతనాన్ని గుర్తించలేదన్నారు. ఏటా జయంతి వేడుకలు జరపాలని, ముఖ్యమంత్రి ఆదేశాలివ్వడం, కుమ్మరి శాలివాహన జాతికి గర్వకారణమన్నారు. స్వయంగా సీఎం స్థాయిలో జగన్‌మోహన్‌రెడ్డి కవయిత్రి మొల్లమాంబ 584జయంతి వేడుకలు జరపడం, కుమ్మరిశాలివాహన ప్రజల్లో ఉత్తేజాన్ని నింపిందని సంతోషం వెలిబుచ్చారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి కుమ్మరి శాలివాహన సంఘం తరపున కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు శంకర్రావు వివరించారు.

పైప్‌లైన్‌కు మరమ్మతులు



మక్కువ మార్కెట్‌లో పైప్‌లైన్‌కు మరమ్మతులు చేస్తున్న దృశ్యం

మక్కువ: మండలకేంద్రం మక్కువ మార్కెట్ వీధిలో రక్షితమంచినీటి పథకం ద్వారా కుళాయిలకు సరఫరా చేస్తున్న పైప్‌లైన్ గురువారం మరమ్మతుల బారిన పడింది. ఈ సమస్యను గుర్తించిన పంచాయతీ అధికారులు శుక్రవారం యుద్ధ ప్రాతిపదికన పాత పైప్‌లైన్‌ను తొలగించి, కొత్త పైప్‌లను అమర్చారు. వేసవికాలం కావడంతో, ఎండలు ఎక్కువ కాస్తున్నందున మక్కువలో భూగర్భజలాలు అడుగంటిపోతున్నాయి. దీంతో బోరుబావులు, నూతులలో నీరు తక్కువగా ఉండడంతో స్థానికులు కుళాయినీటిపైనే ఆధారపడుతున్నారు. గురువారం పైప్‌లైన్ మరమ్మతుల బారిన పడడంతో కుళాయిల ద్వారా నీరు సరఫరా కాక తాగునీటికోసం స్థానికులు అవస్థలు పడ్డారు. పంచాయతీ అధికారులు తక్షణమే పైప్‌లైన్ మార్చివేసి, కొత్తపైప్‌లైన్ అమర్చి కుళాయిల ద్వారా తాగునీరు అందించడంతో మక్కువ ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ఇద్దరు అధికారులకు పదోన్నతులు

సీతానగరం: మండలంలోని పెదభోగిలి మేజర్ పంచాయతీ ఈఓగా(కార్యదర్శి) సేవలందిస్తున్న జె.వెంకటరావుకు గ్రేడ్-1 ఎగ్జిక్యూటివ్ కార్యదర్శిగా పదోన్నతి కల్పిస్తూ పీఆర్ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ దీర్ఘకాలంగా పెదభోగిలి మేజర్ పంచాయతీ కార్యదర్శిగా సేవలందించానని, ఇంతవరకూ సహకరించిన అధికారులు, ప్రజాప్రతినిధులకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు చెప్పారు. అలాగే మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఎఫ్ఏసీ ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న డీజీవీఎస్ త్రినాథ్‌కు పదోన్నతి లభించింది. ప్రభుత్వ జూనియర్‌కాలేజీలో ఇక్కడ ఎఫ్ఏసీ ప్రిన్సిపాల్‌గా పనిచేసిన ఆయనను వీరఘట్టం జీజే కాలేజీ రెగ్యులర్ ప్రిన్సిపాల్‌గా నియమిస్తూ ఇంటర్మీడియట్ బోర్డునుంచి ఉత్తర్వులు వచ్చినట్లు కళాశాల అధ్యాపకుడు రామకృష్ణ తెలియజేశారు.

గంగాడ సర్పంచ్ మృతి

బలిజిపేట:మండలంలోని గంగాడ పంచాయతీ సర్పంచ్, వైఎస్సార్‌సీపీ సానుభూతిపరురాలు లతామంగేష్కర్ (40) అనారోగ్యంతో బాధపడుతూ శుక్రవారం మృతి చెందారు. కొన్నాళ్లుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె ఇటీవల విజయవాడ లోని ప్రైవేట్ హాస్పిటల్‌లో చికిత్స కోసం చేరినప్పటికీ ప్రయోజనం లేకపోయింది. ఆమె భర్త కరోనా సమయంలో మృతిచెందారు. సర్పంచ్ మృతి పట్ల వైఎస్సార్‌సీపీ నాయకులు, గ్రామస్తులు సంతాపం తెలిపారు.

కేజీబీవీలో శతశాతం ఉత్తీర్ణతకు కృషి చేయాలి

• జీసీడీఓ రోజారమణి



మాట్లాడుతున్న జీసీడీఓ కె.రోజారమణి

సీతానగరం: మండలంలోని జోగింపేట కేజీబీవీ మహిళా విద్యాలయంలో 10 వ తరగతి పబ్లిక్ పరీక్షల్లో విద్యార్థులు శతశాతం ఉత్తీర్ణత సాధనకు కృషి చేయాలని జీసీడీఓ కె.రోజారమణి కోరారు. ఈ మేరకు మండలంలోని జోగింపేట కేజీబీవీలో త్వరలో జరగనున్న పబ్లిక్ పరీక్షల్లో పాల్గొనే విద్యార్థులకు హాల్‌టికెట్‌లను ప్రిన్సిపాల్ జె.సంధ్య ఆధ్వర్యంలో జీసీడీఓ రోజారాణి శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులంతా టెన్త్ పబ్లిక్ పరీక్షల్లో శతశాతం ఉత్తీర్ణత సాధించాలని కోరారు. అలాగే విద్యార్థినులందరూ ఆరోగ్యం పట్ల శ్రద్ధ తీసుకుని, ఉన్నత చదువులు అభ్యసించాలని పిలుపునిచ్చారు. ఇంటర్మీడియట్ పరీక్షలు రెండవ సంవత్సరం పూర్తి కావడం వల్ల విద్యార్థినులంతా ఎంసెట్, నీట్ పరీక్షలకు సిద్ధం కావాలని సూచించారు. విద్యార్థినుల విద్యాభివృద్ధి, వృత్తి నైపుణ్యాభి వృద్ధికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇచ్చినట్లు చెప్పారు. ఈ మేరకు మన్యం జిల్లాలో రెండవ విడతలో జోగింపేట కేజీబీవీకి మంజూరైన అటల్ టింకరింగ్ ల్యాబ్‌ను పరీక్షించారు. ఈ ల్యాబ్‌ను వినియోగించుకుని మరిన్ని కొత్త ప్రాజెక్ట్స్ తయారుచేయాలని ఉపాధ్యాయులను కోరారు. కార్యక్రమంలో పాఠశాల అధ్యాపకులు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

సీఎం జగన్ విజయానికి కృషిచేద్దాం

• సాలూరు అసెంబ్లీ వైఎస్సార్‌సీపీ పరిశీలకుడు శ్రీనివాస్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న నియోజకవర్గ పరిశీలకుడు శ్రీనివాస్ రెడ్డి

మక్కువ: ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి, రెండవసారి సీఎంగా ప్రమాణస్వీకారం చేసేందుకు మనమంతా కృషిచేద్దామని సాలూరు అసెంబ్లీ నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ పరిశీలకుడు వి.శ్రీనివాస్‌రెడ్డి కోరారు. ఈ మేరకు వైఎస్సార్‌సీపీ మక్కువ మండలాధ్యక్షుడు మావుడి రంగునాయుడిని శుక్రవారం ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం మండలస్థాయి నాయకులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పరిశీలకుడు శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల కోడ్ శనివారం వచ్చే అవకాశముందని, ఏప్రిల్‌లో జరగబోయే ఎన్నికల్లో వైఎస్సార్‌కాంగ్రెస్ పార్టీ శంఖారావం మోగించేలా నాయకులంతా పనిచేయాల్సి ఉందని పిలుపునిచ్చారు. పేదప్రజలకు మరిన్ని సంక్షేమపథకాలు అందాలంటే, సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డిని మరోమారు గెలిపించుకోవాలని కోరారు. 2019 ఎన్నికల్లో ఎమ్మెల్యే పీడిక రాజన్నదొర విజయానికి మక్కువ మండలంనుంచి సుమారు 6700ఓట్లు మెజార్టీ వచ్చిందని, ఈసారి మరింత ఎక్కువ మెజార్టీ మక్కువ మండలంనుంచి అందించేందుకు నాయకులంతా పనిచేయాలని విజ్ఞప్తి చేశారు. దివ్యాంగులు, 85ఏళ్లు నిండిన వృద్ధులతో ఓట్లు వేయించాల్సిన బాధ్యత పార్టీ నాయకులపై ఉందని స్పష్టం చేశారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

డీడీవోలుగా పంచాయతీ కార్యదర్శులు

• ఎంపీడీవో, మండలాధ్యక్షుడిని సన్మానించిన కార్యదర్శులు



వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు రంగునాయుడిని సన్మానిస్తున్న డీడీవోలు

మక్కువ: గ్రామసచివాలయ వ్యవస్థ ద్వారా నియమితులైన పంచాయతీ కార్యదర్శులను గుర్తించి డీడీవో అధికారులుగా ప్రభుత్వం బాధ్యతలు అప్పగించడంతో పంచాయతీ కార్యదర్శులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఎంపీడీవో పి.దేవకుమార్‌ను, స్థానిక పద్మశ్రీ థియేటర్ వద్ద వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు మావుడి రంగునాయుడిని కార్యదర్శులు మర్యాదపూర్వకంగా కలిసి సంతోషం వ్యక్తంచేశారు. అనంతరం వారిద్దరినీ దుశ్శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా రంగునాయుడు మాట్లాడుతూ ప్రభుత్వం పంచాయతీకార్యదర్శులను గుర్తించి, డీడీవోలుగా పదోన్నతి కల్పించినందున ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమపథకాలు సక్రమంగా ప్రజలకు అందించి, ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని పిలుపునిచ్చారు.

జగన్ పాలనలో ప్రతినెలా పండగే



లబ్ధిదారులకు ఇంటిహక్కు పత్రం అందిస్తున్న మావుడి రంగునాయుడు

మక్కువ: ఏడాదికి ఒకసారి సంక్రాంతి, క్రిస్మస్, బక్రీద్, రంజాన్, మూడేళ్ల కోసారి గ్రామదేవతల పండగలు వస్తాయి కానీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రతి నెలా పేదప్రజలు పండగ చేసుకుంటున్నారని వైఎస్సార్‌సీపీ మక్కువ మండలాధ్యక్షుడు మావుడి రంగునాయుడు అన్నారు. ఈ మేరకు స్థానిక సచివాలయంలో శుక్రవారం మక్కువకు చెందిన 105మంది లబ్ధిదారులకు జగనన్న ఇంటిశాశ్వత హక్కు పత్రాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన రంగునాయుడు మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పేదప్రజలకు అందిస్తున్న సంక్షేమపథకాలతో పాటు, ప్రతి పేదవాడి సొంతింటి కలను నెరవేర్చారన్నారు. ఇంటిస్థలం అందించడంతో పాటు, ఇళ్లు నిర్మించి అందించారన్నారు. అంతేకాకుండా, ఆ ఇంటికి సంబంధించి అన్ని హక్కులను ప్రభుత్వం లబ్ధిదారులకు కల్పించిందని చెప్పారు. అటువంటి ముఖ్యమంత్రికి మీరంతా బాసటగా ఉండాలని పిలుపునిచ్చారు. ఎన్నికలు సమీపిస్తున్నందున ఇంతవరకు మీకష్టాలు, సుఖాలు పట్టించుకోని నాయకులంతా మీ ఇళ్లకు వచ్చి ఓట్ల కోసం లేనిపోని కబ్బురు చెబుతారని, వారి మాయమాటలు విని మోసపోవద్దని హితవు పలికారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, సచివాలయ ఉద్యోగులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

గర్భిణులకు సంక్షేమం

• డీఎంహెచ్‌ఓ బి.జగన్నాథరావు

పార్వతీపురం టౌన్: జగనన్న ఆరోగ్య ఆసరా పథకంతో గర్భిణుల సంక్షేమానికి భరోసా కలుగుతుందని పార్వతీపురం మన్యం జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బి.జగన్నాథరావు అన్నారు. ఈ మేరకు జిల్లా వైద్యఆరోగ్య శాఖ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన ప్రోగ్రాం అధికారుల సమీక్షలో ఆయన మాట్లాడుతూ గర్భిణులకు ప్రభుత్వం అందజేస్తున్న పథకాలపై అవగాహన కల్పిస్తూ ఆస్పత్రి ప్రసవాలు, సాధారణ ప్రసవాలు జరిగేందుకు కృషి చేయాలని సూచించారు. లబ్ధిదారులకు ఈ పథకాలు పొందే విధానాన్ని విపులంగా వివరించాలని చెప్పారు. మొదటి కాన్పు గర్భిణికి రూ.5000 లబ్ధి విడతల వారీగా మొదటి విడత రూ.3000 (గర్భిణి నమోదు సమయంలో), రెండవ విడతగా ప్రసవం తర్వాత, బిడ్డకు మూడవ మోతాదు టీకా వేశాక రూ.2000 లబ్ధిదారుల ఖాతాలోకి జమ చేయనున్నట్లు చెప్పారు. ఆడపిల్ల జననాలు ప్రోత్సహించేందుకు, స్త్రీ లింగ నిష్పత్తి పెంచేందుకు రెండవ కాన్పులో ఆడపిల్లను ప్రసవిస్తే మూడవ మోతాదు టీకా పూర్తయిన తర్వాత ఒకే విడతలో రూ.6000 తల్లి ఖాతాలో జమవుతాయని చెప్పారు. ఇందుకు అవసరమైన మాతా శిశు సంరక్షణ కార్డు, ఆధార్ కార్డులను ఫోన్ నంబర్‌తో బ్యాంకు పుస్తకానికి అనుసంధానించాలని, బ్యాంకు అకౌంట్ పుస్తకం మొదటి పేజీ కాపీ, నివాస ధ్రువీకరణ పత్రం అవసరమవుతాయని చెప్పారు.

సాధారణ ప్రసవాలకు ప్రోత్సాహం

సాధారణ ప్రసవాలను ప్రోత్సహించే దిశగా డా. వైఎస్సార్ ఆరోగ్య ఆసరా ద్వారా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ప్రభుత్వ ఆస్పత్రులు, ఎంపిక చేసిన నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో సాధారణ ప్రసవాలకు రూ. 5000 లబ్ధిదారుని ఖాతాలో జమవుతాయన్నారు. దారిద్ర్యరేఖకు దిగువ ఉన్న (బీపీఎల్) అన్ని వర్గాల కుటుంబాలు, ఆరోగ్యశ్రీ కార్డు ఉన్నవారు ఇందుకు అర్హులని చెప్పారు. గర్భిణీ ఆధార్ కార్డు, నివాస, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, బ్యాంక్ అకౌంట్ పాస్ బుక్, ప్రసవం కోసం అడ్మిట్ అయిన ఫొటో, లేబర్ రూంలో ఫొటో, ప్రసవానంతరం బొడ్డు తాడుతో ఫొటో, ఆరోగ్యశ్రీ కార్డు, స్కాన్ రిపోర్ట్ జతచేయాలని సూచించారు. వాటిపై విస్తృత ప్రచారం చేసి ఆస్పత్రి సాధారణ ప్రసవాలు, స్త్రీ లింగ నిష్పత్తి పెంపునకు అందరూ కృషి చేయాలని కోరారు. సమావేశంలో డాక్టర్ టి.జగన్ మోహనరావు, ఆర్‌బీఎస్‌కే ప్రోగ్రాం అధికారి డాక్టర్ రఘుకుమార్, డాక్టర్ వినోద్, డాక్టర్ తిరుమల ప్రసాద్, డాక్టర్ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.